ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జోగులాంబ గద్వాల జిల్లా వార్తలు
మంగళవారం 29 ఏప్రిల్ 2025
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 38.5 కనిష్ఠం : 25.0





నేలరాలిన మామిడి కాయలు (ఫైల్)

పొంచి ఉన్న.. నీటి గండం..!




జూరాల ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో పూర్తిగా తగ్గిన నీటి నిల్వలు

- జూరాల ప్రాజెక్టులో పడిపోతున్న నీటి నిల్వలు
- గ్రామాల్లో మొదలైన తాగునీటి ఎద్దడి
- ఐదేళ్ల కిందటి పరిస్థితి వస్తుందని ఆందోళన
- సమస్య తలెత్తనివ్వబోమని అంటున్న అధికారులు

అమరచింత, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పాలమూరు జిల్లా వరప్రదాయినిగా ఉన్న జూరాల ప్రాజెక్టు ప్రతీ ఏడాది వేసవిలో సాగు, తాగునీటికి ఇబ్బందికరంగా మారుతోంది. ఈ ప్రాజెక్టులో పూడిక పేరుకుపోవ డంతో పూర్తి స్థాయిలో నీటి నిల్వలు ఉండటం లేదు. మే నెల ప్రారంభం కాకముందే చాలా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులో ఉన్న నీరు మే చివరి నాటికి కూడా సరిపోకపోవచ్చు అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రాజెక్టుకు కర్ణాటక ప్రభుత్వం నీరైనా వదలాలి.. లేక వర్షాలు కురిసి ప్రాజెక్టులోకి నీళ్లు వచ్చే వరకు కష్టాలు తప్పేలా లేదు.

ప్రస్తుతానికి నీరు సరిపోతుంది..



జూరాల ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న నీరు తాగునీటికి సరిపోవచ్చు. మే చివరి వరకు తాగు నీటి ఇబ్బందులు ఏర్పడితే ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, కర్ణాటక ప్రభుత్వం నుంచి నీటి విడుదల చేసే అవకాశాలు ఉంటాయి. ప్రస్తుతం తాగునీటి సమస్య లేదు.

- జగన్మోహన్, జూరాల ప్రాజెక్టు ఈఈ

ఇబ్బందులను అధిగమించేందుకు కృషి



వేసవిలో తాగునీటి ఇబ్బందులను అధిగమించేందుకు ప్రయత్నం చేస్తున్నాం. ఇది వరకు మిషన్ భగీరథ ద్వారా సరఫరా అయ్యే ప్రాంతంలో నీటి నిల్వ తగ్గే అవకాశాలున్నాయి. ఉన్నతాధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి ప్రత్యేక నిధులతో రామన్‌పాడు ప్రాజెక్టు నుంచి మరో మోటార్ అమర్చి ఆత్మకూరు, అమరచింత మునిసిపాలిటీ పరిధిలోని గ్రామాలకు నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- హర్షవర్ధన్, మిషన్ భగీరథ ఏఈఈ



అమరచింతలో తాగునీటి కోసం ఖాళీ బిందెలతో రోడ్డు ఎక్కిన ప్రజలు (ఫైల్)

2019 పరిస్థితి పునరావృతం అవుతుందా?

జూరాలలో రోజు రోజుకు తగ్గుతున్న నీటి నిల్వలను చూస్తే 2019లో వచ్చిన పరిస్థితి మళ్లీ పునరావృతం అవుతుందేమోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అప్పట్లో జూరాల డెడ్ స్టోరేజీకి చేరడంతో ఉమ్మడి జిల్లాలో తాగునీటి కష్టాలు తీవ్రస్థాయిలో పెరిగాయి. అప్పట్లో కర్ణాటక ప్రభుత్వం మూడు టీఎంసీల నీటిని వదిలితే అక్కడక్కడ గుంతలు నిండుతూ జూరాల ప్రాజెక్టు కేవలం 1.5 టీఎంసీ లు మాత్రమే వచ్చి చేరాయి. దీంతో ప్రాజెక్టు అధికారులు లక్షల రూపాయలు ఖర్చు చేసి భారీ మోటార్ల సహాయంతో నదిలోని నీటిని తోడి వేసవిలో తాగునీటిని సరఫరా చేశారు.

పడిపోతున్న నీటి నిల్వలు

జూరాల ప్రాజెక్టులో రోజురోజుకు నీటి నిల్వలు పడిపోతు వస్తున్నాయి. జలాశయంలో గరిష్ఠ నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 3.007 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. అందులో లీకేజీలు ఆవిరి రూపంలో ప్రతీ రోజు 208 క్యూసెక్కుల నీరు అవుట్‌ఫ్లో వెళ్తుంది. ఇందులో చాలా వరకు ప్రాజెక్టులో పూడిక, ఒండ్రు మట్టి, జంతు కళేబరాలతో కూరుకుపోయింది. దీంతో ప్రాజెక్టులో 1.5 టీఎంసీల నీరు మాత్రమే ఉంటుంది. రానున్న రోజుల్లో తాగునీటి పథకాలకు నీరు అందే పరిస్థితి కనబడడం లేదు.



నీరు తగ్గి మట్టి దిబ్బలు తేలిన జూరాల ప్రాజెక్టు

ఆర్టీసీ కండక్టర్ నిజాయతీ

- రూ.13 లక్షలు విలువైన బంగారం, వెండి, నగదు ఉన్న బ్యాగు ప్రయాణికుడికి అప్పగింత
- అభినందించిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్

6

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అల్లే శ్రీనివాసులు

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలి
- ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ బాలాజీరెడ్డి

7

సొసైటీలో అవకతవకలు జరగలేదు

6

- డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి



గద్వాల మండలం కొత్తపల్లిలో కోతదశలో నేలకొరిగిన వరి(ఫైల్)

నేలవాలిన వరి

- ఆందోళనలో అన్నదాతలు
- జిల్లాలో 525 ఎకరాలలో పంట నష్టం
- 40 ఎకరాలలో మామిడి, 10 ఎకరాలలో బొప్పాయి

గద్వాల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి):ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చే దశలో అకాల వర్షం అన్నదాతను కోలుకోలేని దెబ్బతీసింది. ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సానికి వందల ఎకరాలలో వరి పంట నేలకొరిగింది. కొన్ని చోట్ల ధాన్యం రాలిపోయి తీవ్ర నష్టం జరిగింది. మామిడి రైతులు విలవిలలాడుతున్నారు. దాదాపు 40ఎకరాలలోని మామిడి తోటల్లో కాయలు రాలి పోయాయి. అదేవిధంగా 10 ఎకరాలలో బొప్పాయి నేల కొరిగింది. గద్వాల నియోజకవర్గంలో జూరాల, నెట్టంపాడు ప్రాజెక్టుల కింద రైతులు దాదాపు 36వేల ఎకరాలలో వరిసాగు చేశారు. బోరు బావుల కింద సాగు చేసిన రైతులు ఇప్పటికే కోతలు పూర్తి చేయగా కాలువల కింద సాగు చేసిన పంటలు కోతదశలో ఉన్నాయి. ఆదివారం సాయంత్రం గాలి వాన, పిడుగులు పడటంతో రెండు గేదెలు, నాలుగు ఎద్దులు, ఒక ఆవుతో పాటు 15 గొర్రెలు మృతి చెందా యి. అదే సందర్భంగా పెద్ద ఎత్తున వీచిన గాలి వాన ధాటికి వరిపైరు నేలకొరిగింది. గద్వాల మండలంలోని కొత్తపల్లి, గుంటిపల్లి, రేకులపల్లి, వెంకంపేటతో పాటు పలుగ్రామాలలో 170 ఎకరాలలో పంట నేలకొరిగింది. మల్దకల్ మండలంలో 24ఎకరాలు, కేటీదొడ్డి మండలంలో 78 ఎకరాలు, ధరూర్ మండలంలో 22ఎకరాలలో పంట దెబ్బతిన్నది. వ్యవసాయ అధికారుల అంచనా ప్రకారం 335 ఎకరాలలో పంట నష్టం జరిగినట్లు తెలుస్తోంది. కానీ రైతులు మాత్రం 525ఎకరాలలో నష్టం జరిగిందని అంటున్నారు. 40 ఎకరాలలో మామిడి, 10 ఎకరాలలో బొప్పాయి తోటలు దెబ్బతిన్నాయి. అకాల వర్షాలు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసి తీరని నష్టాన్ని మిగిల్చాయి.



కొండపల్లిలో నేలకొరిగిన బొప్పాయి తోట (ఫైల్)

కేంద్రాలలో ధాన్యం ఆందోళనలో రైతులు

ఇప్పటికే కోతలు కోసిన రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించారు. సివిల్ సప్లయ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కొనుగోళ్లు నెమ్మదించాయి. దీంతో అకాల వర్షం వస్తే ధాన్యం తడిచిపోతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కవర్లు కిప్పినా గాలికి పోతున్నాయని వాపోతున్నారు. కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.



డీ 34 దగ్గర ప్రధాన కాలువకు అడ్డంగా ఉన్న బండరాళ్లు

పాడైన కాలువలు

- పట్టించుకోని అధికారులు
- ఏళ్లు గడుస్తున్నా తీరని సమస్య
- ప్రతీ ఏటా సాగునీటి కోసం తప్పని ఇబ్బందులు
- ఆరుతడి పంటలకే పరిమితమైన ఆయకట్టు రైతులు

ఇటిక్యాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సాగు నీటికోసం ప్రతీ ఏటా ఇబ్బందులు తప్పడం లేదని, పాడైన కాలువ దుస్థితిని పటించుకునేవారు లేరని జూరాల కుడికాలువ ఇటిక్యాల మండలంలోని ఆయకట్టు సాగు రైతులు వాపోతున్నారు. ఇటిక్యాల ఉమ్మడి మండలంలో డీ 31 నుంచి డీ28 వరకు జూరాల ప్రధాన కుడికాలువ ఉంది. వందల ఎకరాలలో ఆయకట్టు సాగుకు అధికారులు రూపొందించినా చివరి అయకట్టుకు ప్రతీ ఏటా సాగునీరు అందక రైతులు ఆరుతడి పంటలు సాగు చేస్తున్నారు. ప్రధానంగా మునుగాల శివారులోని డీ 34 పరిధిలో వందల ఎకరాలకు సాగునీరు అందించాలి. మునుగాల, పుటాన్‌దొడ్డి, దువాసిపల్లి, కారుపాకుల గ్రామాల పరిధిలో పంటపొలాలకు సాగునీరు అందించాలి. కాలువ లైనింగ్ పాడైపోవడం, కొందరు రైతులు సాగునీటి కోసం కాలువకు గండి పెట్టడంతో సాగునీరు వృథా అవుతోందని రైతులు వాపోతున్నారు. సాగు నీటికోసం రాత్రి, పగలు పడిగాపులు కాసిన సందర్భాలు ఉన్నాయని, అధికారులు త్వరలో కాలువ పనులు చేపట్టి ఇబ్బందులు తొలగించాలని రైతులు కోరుతున్నారు.



మునుగాల శివారులో పాడైన కాలువ

అభివృద్ధే నా లక్ష్యం

- ప్రాణం ఉన్నంత వరకు ప్రజల కోసం పనిచేస్తా : అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

అచ్చంపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రాణం ఉన్నంత వరకు అచ్చంపేట అభివృద్ధే నా లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఆరోగ్యసమస్యతో కొన్ని నెలలుగా హైదరాబాద్‌లోనే ఉంటున్న ఆయన సోమవారం అచ్చంపేటకు వచ్చిన సందర్భంగా మం డలంలోని హాజీపూర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు గజమాలతో ఆయనకు స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముక్కోటిదేవతల దయ.. మీ అభిమానంతో తిరిగి క్షేమంగా మీ మధ్యకు వచ్చానని, నా కోసం ఎంతో మంది నాయకులు, కార్యకర్తలు పూజలు, ప్రార్థనలు చేసినందుకు అందరికీ రుణపడి ఉంటానని అన్నారు. ఇక వంశీకృష్ణ పని అయిపోయిందని ప్రచారం చేస్తున్న ప్రతిపక్షాలకు తగిన రీతిలో జవాబిస్తానని అన్నారు. గతంలో 100 కిలోమీటర్ల వేగంతో పనిచేశా.. ఇప్పటి నుంచి 120కిలోమీటర్లు స్పీడుతో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. అనంతరం ఉమా మహేశ్వరుడి క్షేత్రంలో ఏర్పాటు చేసిన ప్రసాదాల కౌంటర్‌ను ప్రారంభించి ఆయన సతీమణి అనురాధతో కలిసి ఉమా మహేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి రంగాపూర్ నిరంజన్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

భూ సమస్యల పరిష్కారానికి.. భూ భారతి

- మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఆత్మకూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలంలోని జూరాల గ్రామంలో ఏర్పాటు చేసిన భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమానికి కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతుకు భూమికి ఉన్న అనుబంధాన్ని ప్రపంచంలో ఏ శక్తి విడదీయలేనిదని అన్నారు. 2020 సంవత్సరంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి చట్టం రైతులను గందరగోళంలోకి నెట్టిందని విమర్శించారు. రైతుల కష్టాన్ని గుర్తించిన కాంగ్రెస్ పార్టీ 14 నెలలుగా మేధావులు, కలెక్టర్లతో చర్చించి భూ సమస్యలు సులువుగా పరిష్కరించేలా భూ భారతి చట్టాన్ని తెచ్చిందని తెలిపారు. వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ భూ భారతి చట్టం ద్వారా కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకునే వ్యక్తులు తమ విస్తీర్ణాన్ని నాలుగు దిక్కుల హద్దులను కూడా పొందుపరిచే విధంగా పట్టాదారు పాసు బుక్‌లో ముద్రించడం జరుగుతుందన్నారు. ఎవరైనా తప్పుడు సమాచారంతో రిజిస్ట్రేషన్, లేదా మ్యుటేషన్ చేయించుకుంటే వారిపై అప్పీలు చేసుకుంటే తప్పు చేసిన వారిపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేసే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఈ చట్టాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆత్మకూరు తహసీల్దార్ చాంద్‌పాషా, వ్యవసాయ అధికారి వినయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పరమేష్, నల్గొండ శ్రీనివాసులు, తులసిరాజ్, రహమతుల్లా, మహమూద్, మధు పాల్గొన్నారు.



భూ భారతి అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

పాఠ్యపుస్తకాలు వచ్చేస్తున్నాయ్

- పాఠశాల ప్రారంభం రోజే పంపిణీకి కసరత్తు

7

సర్కారు బడిలో చదివే విద్యార్థులకు పాఠశాల ప్రారంభించే నాడు పుస్తకాలు అందించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే 50శాత పుస్తకాలు వనపర్తి జిల్లాకు చేరాయి. పాఠ్యాంశాలను పుస్తకాల్లో ఒక వైపు ఆంగ్లం, మరో వైపు తెలుగులో ఉండేలా ముద్రించారు.

- వనపర్తి విద్యావిభాగం, (ఆంధ్రజ్యోతి)



వనపర్తిలో వాహనంలో నుంచి పుస్తకాలను గోదాంలోకి తీసుకువస్తున్న కూలీలు(ఫైల్)

ముమ్మరంగా వరి కోతలు

- ఆర్డీఎస్ రైతులను ఆదుకున్న ఏపీ తాగునీటి వాటా
- అకాల వర్షాలతో అన్నదాతల ఆందోళన



వరిని కోస్తున్న యంత్రం

6

నాగర్‌కర్నూల్ సీఈగా విజయభాస్కర్‌రెడ్డి

» పదవీకాలం పొడిగింపునకు ప్రభుత్వం నిర్ణయం

హైదరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ చీఫ్ ఇంజనీర్ (సీఈ)గా విజయభాస్కర్‌రెడ్డిని నియమించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈఎన్‌సీ(ఓ అండ్ ఎం)గా పనిచేస్తున్న ఆయన గత మార్చి 31వ తేదీన పదవీ విరమణ చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు చేపట్టడానికి వీలుగా ఆయన పునర్‌నియామకం చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. దాంతో మంగళవారం ఆయన పునర్ నియామకానికి సంబంధించిన ఉత్తర్వులు వెలువడనున్నాయి. రాష్ట్రంలో ప్రాధాన్య ప్రాజెక్టుల జాబితాలో ఉన్న పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ఉంది. అయితే ఈ పథకం కింద ఒక చీఫ్ ఇంజనీర్(సీఈ)తో పాటు ఇద్దరు ఎస్‌ఈలు ఉండగా... ఈ మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ ఎస్‌ఈ పనిచేస్తున్న ఎ.సత్యనారాయణరెడ్డిని వనపర్తి చీఫ్ ఇంజనీర్(సీఈ)గా పూర్తి అదనపు బాధ్యతలు ప్రభుత్వం కట్టబెట్టింది. దాంతో పాలమూరు ఎత్తిపోతల పథకం పనులు చేపట్టడానికి వీలుగా విజయభాస్కరరెడ్డికి బాధ్యతలు కట్టబెట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించడమే లక్ష్యం

» సమ్మర్ క్యాంపులో రిటైర్డ్ డిప్యూటీ డీఈవో విశ్వనాథం



మానాజీపేట విద్యార్థులతో మాట్లాడుతున్న విశ్వనాథం

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడమే లక్ష్యంగా హెల్పింగ్ హ్యాండ్ సంస్థ సమ్మర్ క్యాంపు నిర్వహిస్తుందని రిటైర్డ్ డిప్యూటీ డీఈవో విశ్వనాథం అన్నారు. మండలంలోని మానాజీపేటలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో సోమవారం రిటైర్డ్ డిప్యూటీ డీఈవో విశ్వనాథం విద్యార్థులకు దిశా నిర్దేశం చేస్తూ.. మాట్లాడారు. మానాజీపేట గ్రామంలో విద్యార్థులకు సమ్మర్ క్యాంపు జూన్ 8వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. ఉదయం విద్యార్థులకు అకాడమిక్ విషయాలను రీడింగ్, రైటింగ్ స్కిల్స్ పెంపొందించేలా వలంటీర్స్ బోధిస్తారని అన్నారు. సాయంత్రం కబడ్డీ, ఖోఖో, క్యారమ్స్, షటిల్, అథ్లెటిక్స్ క్రీడల్లో తర్ఫీదు ఇస్తారని చెప్పారు. ఎంఈవో జయశంకర్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

దేవరగుట్టను వీడిన చిరుత

» కూచూర్ శివారులో సంచారం

నవాబ్‌పేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యన్మనగండ్ల దేవరగుట్టను చిరుత వీడింది. సోమవారం ఉదయం, సాయంత్రం యన్మనగండ్ల, కూచూర్ శివారులో గల చంద్రగుట్ట పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ చిరుత రైతుల కంట పడటంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తూ అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే పరిసర ప్రాంతాలకు చేరుకుని చిరుత పాద ముద్రలు సేకరించారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అయితే చిరుతకు హని కలిగించే విధంగా విద్యుత్ షాక్ ఏర్పాటు చేయరాదని కూచూర్ గ్రామ కార్యదర్శి విజయలక్ష్మి రైతులను కోరారు.

కాంగ్రెస్ నాయకుల బాహాబాహీ

» అధికారుల సమక్షంలోనే ఘర్షణ



ఊర్కొండ మండల పరిషత్ కార్యాలయంలో ఘర్షణ పడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఊర్కొండ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : అధికార పార్టీ నాయకులు బాహాబాహీకి దిగిన సంఘటన సోమవారం ఊర్కొండ మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. మండల కేంద్రానికి చెందిన ఇద్దరు అధికార పార్టీ నాయకుల మధ్య వర్గపోరు తారస్థాయికి చేరింది. యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో విజయం సాధించిన నాయకుడికి, ఓడిపోయిన నాయకుడికి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొన్నది. ఇందిరమ్మ ఇళ్లతో పాటు, సంక్షేమ పథకాల లబ్ధిదారులకు చెందిన జాబితాలను ఇరువర్గాలూ తయారు చేసి అధికారులకు అందించారు. ఆ సమయంలో ఇద్దరు నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. అధికారుల సమక్షంలోనే ఇరువర్గాలకు చెందిన వారు ఒకరినొకరు నెట్టుకోవడంతో పాటు ఒకరిని దాడులు చేసుకున్నారు. ఆ తర్వాత ఇద్దరూ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో మండల నాయకులు రంగంలోకి దిగి వారితో మాట్లాడటంతో కేసులను వాపసు తీసుకున్నారు. ఇక ముందు గొడవలు జరుగకుండా చూసుకుంటామని పోలీసులకు రాజీపత్రం రాసి ఇచ్చినట్లు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జడ్చర్ల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలం, గంగాపురం నుంచి జడ్చర్లకు రెండు ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి, యజమాని, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



చిన్నతాండ్రపాడు గ్రామములో వరి కోస్తున్న కూలీలు



బైనపల్లి గ్రామంలో వరి కోస్తున్న యంత్రం

ముమ్మరంగా వరి కోతలు

» ఆదుకున్న ఏపీ తాగునీటి వాటా

» అకాల వర్షాలతో అన్నదాతల ఆందోళన

అయిజ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కావటంతో పనులు జోరందుకున్నాయి. నవంబర్, డిసెంబర్ మాసాల్లో ఖరీఫ్ ముగిసిన వెంటనే జూరాల, ఆర్డీఎస్, రిజర్వాయర్ల పరిధిలో రైతులు యాసంగి సాగు మొదలు పెట్టారు. ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలో, తుంగభద్రానది వరద నీటిని కాలువ ద్వారా వాడుకుని ఖరీఫ్‌లో గట్టెక్కారు. అప్పుడు పుష్కలంగా సాగు నీరు అందటంతో, అదే ధైర్యంతో అధికారులు వద్దని చెప్పినా వినకుండా రైతులు వరి సాగు చేశారు. రాష్ట్ర సరిహద్దు అయిన అయిజ మండల పరిధిలోని సింధనూరు వద్ద నున్న 12-ఏ నుంచి 24వ డిస్ట్రిబ్యూటరీల వరకు దాదాపు దాదాపు 37 వేల ఎకరాలలో వరి సాగయ్యింది.

చివరి తడికి ఆందోళన

యాసంగి సీజన్‌లో మన రాష్ట్ర వాటా కింద 5.389 టీఎంసీల నీటిని వాడుకున్నారు. పంట చివరి తడి సమయానికి మన వాటా నీరు పూర్తి కావడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. సాగు నీటి కోసం ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి విన్నవించుకున్నారు. ఫలితం లేకపోవడంతో ఆశలు వదులుకున్నారు.

అయితే అదే సమయంలో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు వేసవిలో తాగునీటి కోసం కర్ణాటక ప్రభుత్వం తుంగభద్ర డ్యాం నుంచి 2 టీఎంసీల నీటిని విడుదల చేసింది. ఆ నీరు దిగువనున్న ఆర్డీఎస్ ఆనకట్ట వద్దకు చేరుకుంది. అక్కడి నుంచి ప్రధాన కాలువ ద్వారా కర్ణాటక మీదుగా మన రాష్ట్రం లోని అలంపూర్ నియోజకవర్గ పరిధిలోని అయిజ, వడ్డేపల్లి, రాజోలి తదితర మండలాల్లో పంటలకు చివరి తడి అందడంతో గండం గడిచింది.

వారం రోజులుగా కోతలు

ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలో గత వారం రోజులుగా వరి కోతలు ముమ్మురంగా సాగుతున్నాయి. ఆర్డీఎస్ కాలువ ద్వారా నీరు నింపిన రాజాపూర్, చిన్నతాండ్రపాడు చెరువుల కింద సాగయిన వరి పంట కోతలు కొనసాగుతున్నాయి. భూమి చిత్తడిగా ఉండటంతో కోతలకు యంత్రాలను వినియోగించే పరిస్థితి లేదు. దీంతో ఎక్కువ మంది రైతులు కూలీలతో కోయిస్తున్నారు. అందుకోసం పురుషులకు రోజుకు రూ. 600, మహిళలకు రూ.400 కూలి చెల్లిస్తున్నారు. యంత్రంతో అయితే గంటకు రూ. 3 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఒక ఎకరం వరి కోతకు యంత్రాలతో గంటన్నర సమయం మాత్రమే పడుతుందని రైతులు అంజనేయులు, గిరి, వెంకట్రాములు తెలిపారు. వచ్చే నెల మొదటి వారంలోపు కోతలు పూర్తవుతాయని తెలిపారు. అయితే వారం రోజులుగా కురుస్తున్న అకాలవర్షాలు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. పంట కోస్తే ధాన్యం తడిసి పాడై పోతుందని, కోయకపోతే గింజలు నేల రాలుతాయని చెప్తున్నారు. దీంతో త్వరత్వరగా కోతలు పూర్తి చేస్తున్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

» జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అల్లే శ్రీనివాసులు



మాదకద్రవ్యాల అవగాహన పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి వైద్యవిభాగం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): యువత మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన జీవనం గడపాలని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అధికారి డాక్టర్ అల్లే శ్రీనివాసులు అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన పోస్టర్‌ను కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడి యువత బంగారు భవిష్యత్తును స్వతాహగా కాలరాసుకోవడం జరుగుతుందన్నారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు మాట్లాడారు. యువత మాదకద్రవ్యాలను అరికట్టే దిశగా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపడుతుందన్నారు. రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ అమర్, పాలకవర్గ సభ్యుడు అహమద్, జిల్లా కోఆర్డినేటర్ రాజేందర్‌కుమార్, మహేష్ పాల్గొన్నారు.

సొసైటీలో అవకతవకలు జరగలేదు

» డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

ఉప్పునుంతల ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సొసైటీలో అవకతకలు వచ్చిన ఆరోపణలలో వాస్తవం లేదని డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ సొసైటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఉమ్మడి జిల్లాలోనే రైతుల రుణవిముక్తి చేయడం కోసం డీసీసీబీ (ఓటీఎస్) వన్‌టైం సెటిల్‌మెంట్ తీసుకొచ్చామన్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో 78 సొసైటీలకు మేలు కలిగిందన్నారు. అందులో భాగంగానే ఉప్పునుంతల సొసైటీలో దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న 85 మంది రైతులకు గాను ఓటీఎస్ కింద 39 మంది రైతులు వద్ద రూ.87.13లక్షలు వసూలు చేయాల్సి ఉండగా, ఫీనల్ వడ్డీ బదులు అదనపు వడ్డీ వద్ద జరిగిన పొరపాటుతో రూ.99.94 లక్షలు వసూలు చేశారన్నారు. డీసీసీబీ ఆడిట్‌లో రూ.12 లక్షల అదనంగా రావడంతో తిరిగి సొసైటీకి అప్పగించినట్లు వివరించారు. కొరటికల్, వెల్టూరు చెందిన పది మంది రైతులకు రూ.12 లక్షలు మార్చి 28న వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఓటీఎస్ ద్వారా రూ.41 కోట్లు రికవరీ జరిగితే రూ.21కోట్లు బ్యాంకు నష్టపోయిందని చెప్పారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈవో పురుషోత్తంరావు, అచ్చంపేట మేనేజర్ రవికుమార్, ఉప్పునుంతల సొసైటీ చైర్మన్ భూపాల్‌రావు, సీఈవో రవీందరావు తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ విగ్రహావిష్కరణకు మహిళలు హాజరు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి జయలక్ష్మి

మక్తల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నారాయణపేట చౌరస్తాలో మే 5న ఏర్పాటు చేసే భగత్‌సింగ్ విగ్రహావిష్కరణకు మహిళలు అధిక సంఖ్యలో హాజరు కావాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి జయలక్ష్మీ అన్నారు. సోమవారం నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బీ అతిథిగృహం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రిటీష్ సంకెళ్ల నుంచి దేశానికి విముక్తికోసం ప్రాణత్యాగం చేసిన భగత్‌సింగ్ సేవలు మరువలేనివన్నారు. విగ్రహావిష్కరణకు ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్, జిల్లా అధ్యక్షురాలు శారద, రాష్ట్ర సహాయ కార్యదర్శి సంధ్య, బబ్లో, నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కండక్టర్ నిజాయతీ

» రూ.13 లక్షలు విలువైన బంగారం, వెండి, నగదు ఉన్న బ్యాగు ప్రయాణికుడికి అప్పగింత

» అభినందించిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్



అచ్చంపేట డిపో కండక్టర్‌ను సన్మానించిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్

హైదరాబాద్/ అచ్చంపేటటౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : బస్సులో ప్రయాణికుడు పోగొట్టుకున్న రూ.13 లక్షల విలువైన బంగారం, వెండి, నగదు ఉన్న బ్యాగును తిరిగి బాధితుడికి అప్పగించి కండక్టర్ నిజాయితీ చాటుకున్నాడు. కండక్టర్ నిజాయతీని ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ అభినందించారు. ఈ నెల 26న అచ్చంపేట-హైదరాబాద్ రూట్‌లో వెంకటేశ్వర్లు కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బస్సు ఎంజీబీఎస్ చేరుకోగానే సీటులో ఓ బ్యాగును ప్రయాణికుడు మరిచిపోయినట్లు గుర్తించాడు. బ్యాగు తెరిచి చూడగా అందులో బంగారం, వెండి ఆభరణాలతోపాటు నగదు, పలు సర్టిఫికెట్లు గమనించాడు. విషయాన్ని వెంటనే అచ్చంపేట డీఎం మురళీ దుర్గాప్రసాద్‌కు కండక్టర్ ఫోన్ చేసి సమాచారం అందించాడు. డీఎం సూచన మేరకు బంగారం, వెండి, నగదు ఉన్న బ్యాగును ఎంజీబీఎస్ స్టేషన్ మేనేజరు కార్యాలయంలో భద్రపరిచారు. ఇంతలో అనిల్‌కుమార్ అనే ప్రయాణికుడు డీఎంకు ఫోన్ చేసి బస్సులో తన బ్యాగు మరిచిపోయినట్లు చెప్పాడు. కందూరులో బస్సు ఎక్కి సీబీఎస్‌లో దిగి కాచిగూడకు వెళ్లిపోయానని వివరించాడు. బ్యాగు ఎంజీబీఎస్‌లో ఉందని చెప్పడంతో అతను అక్కడికి వెళ్లగా ఆర్టీసీ అధికారులు వివరాలు పరిశీలించి బ్యాగు అప్పగించారు. బ్యాగులో 14 తులాల బంగారం, 10 తులాల వెండి ఆభరణాలతోపాటు రూ. 14,800 నగదు, కుమారుడి బర్త్ సర్టిఫికెట్, విద్యార్హత పత్రాలు ఉన్నాయి. విషయం తెలుసుకున్న సంస్థ ఎండీ సజ్జనార్ సోమవారం ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో కండక్టర్ వెంకటేశ్వర్లును అభినందించారు. కార్యక్రమంలో ఈడీ మునిశేఖర్, ఫైనాన్స్ అడ్వైజర్ విజయ పుష్ప తదితరులు పాల్గొన్నారు

క్రికెట్ టోర్నీ పోస్టర్ల ఆవిష్కరణ



క్రికెట్ టోర్నీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, పక్కన మాజీ కౌన్సిలర్లు అంజయ్య, చెన్నవీరయ్య

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : జాంధ్ర ప్రీమియర్ లీగ్ క్రికెట్ (జేపీఎల్) టోర్నీ పోస్టర్లను మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని బాలుర కళాశాల మైదానంలో మే 16 నుంచి 18వ తేదీ వరకు జేపీఎల్ టోర్నీ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ యువతీ యువకులు క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు అంజయ్య, చెన్నవీరయ్య, పవన్, అనిల్‌కుమార్, రాఘవేందర్, శివ పాల్గొన్నారు.

పెన్షనర్లకు రావాల్సిన నగదు డీఏలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మనోహర్‌గౌడ్

మక్తల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లకు రావల్సిన నగదు డీఏలను ఒకేసారి చెల్లించాలని పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మనోహర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సంతోష్ అన్నారు. సోమవారం మక్తల్ పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో సంఘం మక్తల్ మండల అధ్యక్షుడు గోపాలం అధ్యక్షతన నిర్వహించిన జిల్లా పెన్షనర్ల సంఘం సమావేశానికి వారు హాజరై, మాట్లాడారు. కొత్త పీఆర్సీని వెంటనే ఏర్పాటు చేయాలని, కార్పొరేట్ ఆసుపత్రిలో ఉచిత వైద్యం అందించాలని, ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, సీపీపీ రికవరీ 15 ఏళ్ల నుంచి 11 ఏళ్లకు తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంతో అన్ని విషయాలు చర్చించి పరిష్కరించేలా పనిచేస్తామన్నారు. అనంతరం వంద మంది పెన్షనర్లను సన్మానించారు. స్వంత ఖర్చుతో అన్నదానం చేసిన సిద్దిలింగయ్యను అభినందించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నిర్వాహణ కార్యదర్శి సూర్యప్రకాష్, కోశాధికారి సిద్దిలింగయ్య, సభ్యులు పాల్గొన్నారు.

అర్హులకందని పీఎం కిసాన్ పథకం

కందనూలు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్ పథకం అందక ఎంతో మంది రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పథకం ప్రవేశపెట్టినప్పుడు దరఖాస్తు చేసుకున్న వారికి తప్ప ఇంత వరకు మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం లేకుండాపోయింది. రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు పథకం తీసుకొచ్చిన తర్వాత కేంద్రంలోని మోడీ సర్కార్ రైతులకు మేలు చేకూర్చేందుకు పీఎం కిసాన్ పథకం ద్వారా సంవత్సరానికి రూ.6వేలు అందజేస్తుంది. కొత్తగా భూమి కొనుగోలు చేసిన వారికి కూడా ఈ పథకం వర్తించడం లేదు.

వారసత్వంగా వచ్చిన భూములకు మాత్రమే పీఎం కిసాన్ అందించేందుకు ప్రభుత్వం రూపకల్పన చేసింది. కొత్తగా భూములు కొనుగోలు చేసిన వారికి మాత్రం ఈ పథకం వర్తించకపోవడం రైతుల పాలిట శాపంగా మారింది.



కొంతమంది రైతులకు అర్హత ఉన్నప్పటికీ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఏళ్లు గడుస్తున్నా తమకు పీఎం కిసాన్ డబ్బులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో దాదాపుగా 3,30,836 రైతు ఖాతాలు ఉండగా, 1,50,021మంది రైతులకు మాత్రమే పీఎం కిసాన్ డబ్బులు వస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న వారిలో 300 పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

డబ్బులు రావడం లేదు



తనకు వారసత్వంగా భూమి ఉన్నప్పటికీ పీఎం కిసాన్ పథకం డబ్బులు రావడం లేదు. ఎన్నోసార్లు దరఖాస్తు చేసుకున్నా, అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది.

- బుల్లె పెద్దనిరంజన్, రైతు, పెద్దకొత్తపల్లి

కొత్త వారికి వర్తించదు



కొత్తగా భూమి కొనుగోలు చేసిన రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పీఎం కిసాన్ పథకం వర్తించదు. వారసత్వంగా వచ్చిన భూములు ఉంటే పాత భూములకు సంబంధించిన పత్రాలతో పాటు, కొత్త పాస్‌బుక్కులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటే విచారించి డబ్బులు అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

- చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

క్రైం కార్నర్

చెరువులో పడి మహిళ మృతి

కృష్ణ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మతి స్థిమితం లేని ఓ మహిళ చెరువులో పడి మృతి చెందింది. నారాయణపేట జిల్లా, కృష్ణ మండల పరిధిలోని గుడెబల్లూరులో సోమవారం ఈ సంఘటన రిజిగింది. ఎస్ఐ నవీద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కడెచూరు దేవమ్మ (45) రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. సోమవారం మధ్యాహ్నం చెరువులో ఆమె మృతదేహం కనిపించింది. స్థానికులు కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీశారు. ఈ మేరకు కుమారుడు సోమప్ప ఫిర్యాదు చేయడంతో, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కుక్కను తప్పించబోయి బైక్ బోల్తా

» ఇద్దరికి తీవ్ర గాయాలు

చారకొండ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఎదురుగా వస్తున్న కుక్కను తప్పించబోయి ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడటంతో ఇద్దరు గాయపడ్డారు. నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ మండలం జూపల్లిలో ఈ సంఘటన జరిగింది. కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామానికి చెందిన పర్వతాలు, శ్రీను సోమవారం ఉదయం ద్విచక్రవాహనంపై జూపల్లి గ్రామానికి బయలుదేరారు. ఆ గ్రామ బస్‌స్టేజీ సమీపంలో అడ్డొచ్చిన కుక్కను తప్పించే యత్నంలో వాహనం అదుపుతప్పి కిందపడ్డారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిద్దరినీ కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా మారడంతో వెల్దండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

వివాహిత అదృశ్యం, కేసు నమోదు

రాజాపూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, రాజాపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యం అయినట్లు ఎస్ఐ శివానందం తెలిపారు. శనివారం రాత్రి 8.30 గంటల సమయంలో చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో ఆమె భర్త సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే గ్రామానికి చెందిన ఆంజనేయులపై అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడులు



పట్టుబడిన డబ్బు, సెల్‌ఫోన్లు

నారాయణపేట రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఏడుగురిని అదుపు లోకి తీసుకున్నారు. నారాయణపేట జిల్లా, నారాయణపేట మండలం, బోయిన్ పల్లి శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు సోమవారం దాడులు చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. రూ.3,450 నగదు, 6 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై గేమింగ్ యాక్టు ప్రకారం కేసు నమో దు చేసినట్లు రూరల్ ఎస్ఐ రాముడు తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ఉప్పునుంతల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, ఉప్పునుంతల మండల పరిధిలోని లత్తీపూర్ గ్రామ శివారులోని కట్ట మైసమ్మ పక్క ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతి చెందిన వ్యక్తి వయసు 44 సంవత్సరాలు, ఎత్తు 5.5 అడుగులు ఉంటుందని ఎస్ఐ వెంకట్ రెడ్డి తెలిపారు. ఎవరైనా తెలిసిన వారు ఉంటే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

కారు, బైక్ ఢీకొని వ్యక్తి మృతి

తాడూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : కారు, ద్విచక్రవాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, తాడూరు మండలంలోని యంగంపల్లి గ్రామ సమీపంలో సోమవారం ఈ సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దకొత్తపల్లి మండలంలోని కల్వకోల్ గ్రామానికి చెందిన రాములు (50) ద్విచక్రవాహనంపై కల్వకుర్తి నుంచి నాగర్‌కర్నూల్ వైపు వస్తున్నాడు. అదే సమయంలో కల్వకుర్తి వైపు వస్తున్న కారు యంగంపల్లి గేటు వద్ద ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో రాములు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ గురుస్వామి తెలిపారు. ఘటనకు సంబంధించి కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయలేదని చెప్పారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

జడ్చర్ల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి నీటి గుంతలో పడి మృతి చెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలం ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణ ప్రాంతంలో ఈ సంఘటన జరిగింది. వల్లూరు గ్రామానికి చెందిన ఎల్లప్ప(45) ఆదివారం సాయంత్రం చేపలను పట్టేందుకు ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణ స్థలానికి సమీపంలోని నీటిగుంతల వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయి మృతి చెందాడు. సోమవారం మధ్యాహ్నం ఆయన మృతదేహం తేలింది. స్థానికులు గమనించి సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని జడ్చర్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఉరి వేసుకొని గిరిజనుడి ఆత్మహత్య



మల్లయ్య (ఫైల్)

మన్ననూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ సభ్యులతో జరిగిన చిన్న గొడవ ఓ వ్యక్తి ఆత్మహత్యకు దారి తీసింది. నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ మండలంలోని మన్ననూరులో ఈ సంఘటన జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మన్ననూరు చెంచు కాలనీకి చెందిన దాసరి మల్లయ్య (40) సోమవారం ఉదయం కుటుంబ సభ్యులతో గొడవ పడ్డాడు. ఆ తర్వాత సమీపంలోని చెంతల చెరువు వద్దకు వెళ్లి చెట్టుకు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసు కున్నాడు. అదే రోజు మధ్యాహ్నం చేపలు పట్టేందుకు చెరువుకు వెళ్లిన స్థానికులు గమనించి కాలనీ వాసులకు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని అమ్రాబాద్ ఆసుపత్రికి తరలించారు. మల్లయ్యకు భార్య శోభ, ఇద్దరు మగ పిల్లలున్నారు.

అసిస్టెంట్ లైన్‌మన్‌పై దాడి

జడ్చర్ల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్‌శాఖ అసిస్టెంట్ లైన్‌మన్ విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా అతడిపై ఓ వ్యక్తి దాడి చేశాడు. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలం తంగెళ్లపల్లి శివారులో ఈ సంఘటన జరిగింది. జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆల్వాన్‌పల్లి హెడ్‌క్వార్టర్‌లో సేనావత్ శ్రీనివాసులు అసిస్టెంట్ లైన్‌మెన్‌గా పని చేస్తున్నారు. తంగెళ్లపల్లి శివారులో విద్యుత్ తీగలు తెగిపడగా, సోమవారం వాటిని సరి చేసేందుకు వెళ్లారు. అదే సమయంలో వనెమోని సుదర్శన్ అనే వ్యక్తి అతడి విధులకు ఆటంకం కలిగించాడు. దుర్భాషలాడుతూ దాడి చేశాడు. అతడి వాహనం హెడ్‌లైట్‌ను రాయితో పగులగొట్టాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

జడ్చర్ల పట్టణంలో పాదచారులపై...

ఇద్దరు పాదచారులపై మరో ఇద్దరు దాడి చేసినట్లు సీఐ కమలాకర్ తెలిపారు. జడ్చర్ల పట్టణంలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన కొంగలి లక్ష్మయ్య, బాలస్వామి అనే వ్యక్తులు శనివారం రాత్రి 10.30 గంటల సమయంలో కొత్తబస్టాండ్ నుంచి కాలినడకన ఇంటికి వస్తుండగా క్రాస్‌రోడ్ వద్ద బ్రిడ్జి కింద ఓ బైక్ వేగంగా వారిపైకి రావడంతో చూసుకొని నడపాలంటూ లక్ష్మయ్య హెచ్చరించారు. దీంతో బైక్‌పై ఉన్న అరవింద్‌కుమార్, పల్లి శశికుమార్ వారితో వాగ్వాదానికి దిగి దాడికి పాల్పడ్డారు. సంఘటనపై బాధితుడు లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

పాఠ్య పుస్తకాలు వచ్చేస్తున్నాయి

» పాఠశాల ప్రారంభం రోజు పంపిణీకి కసరత్తు



జిల్లా కేంద్రంలోని గోదాంలో భద్రపరిచిన పాఠ్య పుస్తకాలు

వనపర్తి విద్యా విభాగం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బడుల్లో చదువుకునే విద్యార్థులకు విద్యాసంవత్సరం మొదటి రోజే పాఠ్య పుస్తకాలను అందించేందుకు విద్యాశాఖ కసరత్తు మొదలుపెట్టింది. ఇప్పటికే ప్రభుత్వం పాఠ్య పుస్తకాలను ముద్రించి సిద్ధం చేసింది. మొత్తం 2,60,189 పుస్తకాలు అవసరం కాగా, ఇప్పటికే 1,27,080 పుస్తకాలు వనపర్తి జిల్లాకు చేరాయి. జిల్లా కేంద్రంలోని గోదాంలో వీటిని భద్రపరిచిన అధికారులు, ఆయా మండలాలకు తరలిస్తున్నారు.

ఒక వైపు ఆంగ్లం, మరో వైపు తెలుగు

పాఠ్యాంశాలను పుస్తకాల్లో ఒక వైపు ఆంగ్లం, మరో వైపు తెలుగులో ముద్రించారు. మూడు నుంచి 10వ తరగతి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను రెండు విడతలు, పార్ట్ 1, పార్ట్ 2గా అందించనున్నారు. జూన్ మాసంలో పాఠశాల ప్రారంభం రోజే పార్ట్ -1 పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేయనున్నారు. అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని డీఈవో అబ్దుల్ ఘని తెలిపారు. అన్ని తరగతుల గణిత శాస్త్రం పుస్తకాల్లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ పాఠ్యాంశాలను ప్రత్యేకంగా చేర్చనున్నట్లు చెప్పారు. వాటిపై క్యూఆర్ కోడ్ ఉంటుందని, దానిని మొబైల్ ఫోన్‌తో స్కాన్ చేస్తే పాఠ్యాంశాలను దృశ్య రూపంలో చూడొచ్చని తెలిపారు.

యుడైస్ ప్లస్ ఆధారంగానే ...

యూడైస్ ప్లస్ ఆధారంగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా, ఎన్ని పుస్తకాలు అవసరమో జిల్లా విద్యాశాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపించారు. వనపర్తి జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక 358, ప్రాథమికోన్నత 60, ఉన్నత 99, మోడల్ 3, కేజీబీవీలు 14, సోషల్ వెల్ఫేర్ 5, ట్రైబల్ వెల్ఫేర్ 2, మైనార్టీ వెల్ఫేర్ 3, మహాత్మా జ్యోతిరావు పూలే 4, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలల్లో చదువుతున్న దాదాపు 47 వేల మంది విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలను పంపిణీ చేయనున్నారు. ఆయా పాఠశాలల్లో ప్రస్తుతం చదువుకుంటున్న వారితో పాటు, కొత్తగా చేరే విద్యార్థులకు కూడా పుస్తకాలను అందించనున్నారు.

పుస్తకాలపై క్యూఆర్ కోడ్

పాఠ్య పుస్తకాలు పక్కదారి పట్టకుండా వాటిపై క్యూ ఆర్ కోడ్‌ను ముద్రించారు. వీటి ఆధారంగా ఏ మండలంలోని ఏ పాఠశాలకు ఎన్ని పుస్తకాలు పంపించారో పక్కాగా లెక్క తెలుసుకునే అవకాశం ఉంటుంది. పాఠశాలల ప్రారంభానికి ముందే విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠ్యపుస్తకాలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందించేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.



మిగతా జిల్లాల్లో.. మహబూబ్‌నగర్ జిల్లాలో 852 పాఠశాలలున్నాయి. మొత్తం 5,99,600 పాఠ్య పుస్తకాలు అవ సరం కాగా ఇప్పటివరకు 2.10 లక్షల పుస్తకాలు వచ్చాయి. నారాయణపేట జిల్లాలో మొత్తం 508 పాఠశాలలున్నాయి. 2.45 లక్షల పాఠ్యపుస్తకాలు గాను, 1.55 లక్షల పుస్తకాలు వచ్చాయి. జోగుళాంబ గద్వాల జిల్లాలో మొత్తం 452 ప్ర భుత్వ పాఠశాలలు, 12 కేజీబీవీలు ఉన్నాయి. మొత్తం 5,42,610 పాఠ్యపుస్తకాలు అవసరం కాగా, 1.20 లక్షల పుస్తకాలు జిల్లాకు చేరాయి.

తగ్గిన ఎండలు

వనపర్తి/నారాయణపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వారం పది రోజులుగా తీవ్రంగా ఉన్న ఎండలు కాస్త శాంతించాయి. ఆదివారం మధ్యాహ్నం నుంచి వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో పాటు జిల్లాలోని పలు చోట్ల మోస్తరు వర్షం కురిసింది. దీంతో సోమవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. వనపర్తి జిల్లా కొత్తకోటలో 38.7 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. రేవల్లి మండలంలో 22.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. జోగుళాంబ గద్వాల జిల్లాలో గరిష్ఠంగా 38.5 డిగ్రీలు, కనిష్ఠంగా 20.7, మహబూబ్‌నగర్ జిల్లాలో గరిష్ఠం 38 డిగ్రీలు, కనిష్ఠం 26 నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో గరిష్ఠం 36 డిగ్రీలు, కనిష్ఠం 25 డిగ్రీలు, నారాయణపేట జిల్లాలో గరిష్ఠంగా 36 డిగ్రీ సెంటీగ్రేడ్లు నమోదుకాగా, కనిష్ఠంగా 27 డిగ్రీ సెంటీగ్రేడ్స్ ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో ఉక్కపోత, ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ వారం రోజుల కిందటితో పోల్చితే కొంత ఊరటగా ఉన్నది.

ఈ నెల 10న అరుణాచలానికి ప్రత్యేక బస్సు

మహబూబ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడు రాష్ట్రం, అరుణాచల క్షేత్రానికి ఈ నెల 10న ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేస్తున్నట్లు మహబూబ్‌నగర్ డిపో మేనేజర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణం నుంచి 10న సాయంత్రం 7 గంటలకు బస్సు బయలుదేరుతుందని తెలిపారు. 11న కాణిపాకం, గోల్డెన్ టెంపుల్‌ను దర్శించుకొని అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. 13న ఉదయం మహబూబ్‌నగర్‌కు వస్తుందని తెలిపారు. టికెట్లను రిజర్వేషన్ కౌంటర్లో బుక్ చేసుకోవచ్చని సూచించారు.

రైతులకు గన్నీ బ్యాగుల కొరతను తీర్చాలి

» కాంగ్రెస్ పాలనలో రైతులకు అన్నీ కష్టాలే

» బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజేందర్‌రెడ్డి

నారాయణపేటటౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పంటలను పండించే రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగునా మరిన్ని కష్టాలు పెడుతోందని బీఆర్‌ఎస్ పార్టీ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో ప్రభుత్వం ఆలస్యంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఇబ్బంది పెడుతోందన్నారు. దీనికి తోడు సరిపడా గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గన్నీ బ్యాగుల కోసం అధికారులకు మొర పెట్టుకున్నప్పటికి వారి నుంచి స్పందన రాకపోవడంతో చివరకు అన్నదాతలు రోడ్డెక్కాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.

గత పది రోజుల నుంచి మక్తల్, మాగనూరు, ధన్వాడ, నారాయణపేటలలో రైతులు రాస్తారోకోలు, అధికారులను నిలదీసే కార్యక్రమాలను చేపట్టినా కాంగ్రెస్ ప్ర భుత్వానికి మాత్రం సరిపడా గన్నీ బ్యాగులను అందించాలన్న సోయి మాత్రం లేకుండా పోయిందన్నారు. నారాయణపేట జిల్లాలో ఈ ఒక్క యాసంగి సీజన్‌కు 37 లక్షల గన్నీ బ్యాగుల అవసరం ఉందని గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 20 లక్షల బ్యాగులను మాత్రమే ఇప్పటివరకు అందించిందని వాటిలో కూడా చినిగిపోయిన సంచులు అందించడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలకు ధాన్యం తడిచిపోయి రైతులు నష్టపోతే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. మూడురోజుల్లో గన్నీ బ్యాగులను అందించి రైతుల నుంచి చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేయాలని లేకపోతే నారాయణపేట జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయం ముందు బీఆర్‌ఎస్ తరపున ధర్నా చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

రైతులను ఆదుకునేందుకే ఉత్పత్తిదారుల సంస్థ

» సహకార సంఘం జిల్లా ఆడిట్ అధికారి ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సహకార సంఘం ఆడిట్ అధికారి ప్రసాద్

గోపాల్‌పేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : రైతులను ఆదుకునేందుకే ప్రభుత్వం వ్యవసాయ సహకార సంఘాన్ని రైతు ఉత్పత్తిదారుల సంస్థగా మారుస్తోందని సహకార సంఘం జిల్లా ఆడిట్ అధికారి ప్రసాద్ తెలిపారు. వనపర్తి జిల్లా, గోపాల్‌పేట మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు, వారికి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు కేంద్రం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం ఇక నుంచి రైతు ఉత్పత్తిదారుల సంస్థగా మారుతుందన్నారు. క్లస్టర్ల వారీగా సంస్థల నిర్వహణ, బేస్‌లైన్ సర్వే, ఏజెన్సీల అమలు, వ్యాపార ప్రణాళికల రూపకల్పన, శిక్షణ కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను సహకార యూనియన్‌కు అప్పగించినట్లు తెలిపారు. పీఏసీఎస్ లకు రూ. 15 లక్షల గ్రాంటు ఇవ్వనున్నారని, అలాగే ఏడాదికి రూ. 6 లక్షల చొప్పున రూ. 18 లక్షలు అందించనున్నట్లు తెలిపారు. ఈ నిధులతో ఉత్పత్తిదారుల సంస్థలు రైతులకు అవసరమైన వ్యవసాయ పని ముట్లను అందించడం, పంట ఉత్పత్తుల కొనుగోలు తదితర కార్యకలాపాలను నిర్వహిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు, సీనియర్ ఇన్‌స్పెక్టర్లు మహబూబ్ అలీ, బీక్యా నాయక్, జూనియర్ ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్, సీఈవో రామ్మోహన్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల అయిజకు తరలించాలి

» అఖిలపక్షం నాయకుల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న అఖిలపక్షం నాయకులు

అయిజ టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఎర్రవల్లిలో కొనసాగుతున్న గురుకుల పాఠశాలను అయిజ పట్టణానికి తరలించాలని అఖిలపక్షం నాయకులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం తహశీల్దార్ జ్యోతికి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ మూడేళ్ల క్రితం ప్రభుత్వం అయిజ మండలానికి గురుకుల పాఠశాలను మంజూరు చేసిందని, కానీ సౌకర్యాలు లేవన్న కారణంతో ఎర్రవల్లిలో కొనసాగిస్తున్నారని తెలిపారు. అక్కడ పాఠశాల కొనసాగుతున్న అద్దె భవనంలో కనీస సౌకర్యాలు కూడా లేవని చెప్పారు. ఇప్పటికే అయిజ పట్టణానికి చెందిన కొందరు తమ భవనాలను తక్కువ అద్దెకు ఇచ్చేందుకు ముందుకొస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌ల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

వచ్చే విద్యా సంవత్సరంలో అయిజలో గురుకుల పాఠశాల నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు ఆంజనేయులు, నాగర్‌దొడ్డి వెంకట్రాముడు, వెంకటేశ్వర్‌రావ్, ఆంజనేయులు, హనుమంతు, తిరుమల్‌రెడ్డి, సుధాకర్‌గౌడు, గోపాలకృష్ణ, లక్ష్మణ్‌గౌడు, యేసురాజు, కిష్టన్న, విజయ్, వీరారెడ్డి పాల్గొన్నారు.

రేపు భూ భారతిపై అవగాహన సదస్సు

» హాజరుకానున్న మంత్రి పొంగులేటి



కురుమూర్తి జాతర మైదానంలో స్థలాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్, అధికారులు

చిన్నచింతకుంట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం కురుమూర్తి వేంకటేశ్వరస్వామి వారి జాతర మైదానంలో బుధవారం నిర్వహించనున్న భూ భారతి అవగాహన సదస్సుకు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈ సందర్భంగా సోమవారం అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఆర్డీవో నవీన్, చిన్నచింతకుంట, కౌకుంట్ల తహసీల్దార్లు ఎల్లయ్య, రహమాన్ ఎస్ఐ రాంలాల్‌నాయక్ స్థలాన్ని పరిశీలించారు. అదే విధంగా దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయితో పాటు పలువురు ఎమ్మెల్యేలు, నాయకులు కూడా హాజరుకానున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

రాణించిన రావూస్ విద్యార్థులు



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు, యాజమాన్యం, అధ్యాపక బృందం

వనపర్తి విద్యా విభాగం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాలలో రావూస్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో సంతోష్ నాయుడు 468, అక్షయ 467, రేష్మాబేగం 467, హర్షితశ్రీ 466, రాకేశ్ 466 మార్కులు సాధించారు. బైపీసీలో రాధ 435, దేవిక 435, గోవిందమ్మ 434 మార్కులు సాధించారు. సీఈసీలో ఫరూఖ్‌ఖాన్ 483, ఎంఈసీలో ఆయేషాబేగం 487, కీర్తన 484 మార్కులు తెచ్చుకున్నారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో సందడి మాధవి 994, హర్షవర్ధన్ 991, బోధని గాయత్రి 990, బైపీసీలో మనీషా 990, సీఈసీలో మొల్లరాల రవి 929, ఎంఈసీలో గుర్రాల నందిని 910 మార్కులతో సత్తా చాటారు. ఈ సందర్భంగా సోమవారం వారిని అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీశ్‌యాదవ్, గౌనికాడి యాదయ్య, శివకుమార్‌తో పాటు ప్రిన్సిపాల్, యాజమాన్య ప్రతినిధులు రాంకుమార్, శ్రీనివాస్, కె.శ్రీనివాస్, అమరేందర్ రెడ్డి, రమేశ్‌రెడ్డి పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

» అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలి

» ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ బాలాజిరెడ్డి



మానవపాడు ఆసుపత్రిలో మందులను పరిశీలిస్తున్న జాయింట్ డైరెక్టర్ బాలాజిరెడ్డి

మానవపాడు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులను ఆసుపత్రిలో అందుబాటులో ఉంచాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ బాలాజిరెడ్డి అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా, మానవపాడు మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మందులు నిల్వలను పరిశీలించారు. వైద్యులు, ఉద్యోగుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఓపీని తనిఖీ చేశారు. ల్యాబ్‌తో పాటు వివిధ వార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గడువు ముగిసిన మందులను నిల్వ ఉంచొద్దని సూచించారు. రోగులకు అసౌకర్యం కలుగకుండా చికిత్స అందించాలన్నారు. పరిస్థితి విషమంగా ఉన్న రోగులను మాత్రమే జిల్లా ఆసుపత్రికి పంపించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో సిద్ధప్ప, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ ప్రసన్నారాణి, డాక్టర్ హిమమానస, తిరుమలరావు, చంద్రన్న పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

సమస్యల పరిష్కారానికే భూ భారతి

▸▸ వీరభద్రప్ప, ఇటిక్యాల తహసీల్దార్



ఇటిక్యాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): భూ వివాదాలు, సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం భూభారతి పోర్టల్-2025ను రూపొందించిందని ఇటిక్యాల తహసీల్దార్ వీరభద్రప్ప అన్నారు. అందులోని సదుపాయాల గురించి సోమవారం ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో తెలిపారు.

భూ భారతి చట్టం ద్వారా రైతులకు ఏం మేలు జరుగుతుంది?

రైతుల భూ సమస్యలు 50శాతం తహసీల్దార్ కార్యాలయాల్లోనే పరిష్కారం అవుతాయి. మ్యుటేషన్, రిజిస్ట్రేషన్‌లు ఇక్కడే అవుతాయి. ధరణిలో గతంలో కుటుంబంలో ఐదుగురు వుంటే ఇద్దరే స్లాట్ బుక్ చేసుకుంటే ఇద్దరికే ఎలాంటి విచారణ లేకుండా రిజిస్ట్రేషన్ చేసేవారం. భూభారతి చట్టంలో కుటుంబ సభ్యులతో విచారించి పరిష్కరిస్తాం.

భూభారతి చట్టం ఎప్పటి నుంచి అమల్లోకి వస్తుంది?

భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఏప్రిల్ 14న సీఎం రేవంత్‌రెడ్డి భూ భారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చారు. పైలట్ ప్రాజెక్టుగా కొన్ని మండలాల్లోనే అమలు చేస్తున్నారు. జూన్ రెండు నుంచి పూర్తిగా అమల్లోకి వస్తుంది.

గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తారా?

భూ భారతి చట్టం పటిష్ఠ అమలుకు గ్రామాల్లో సదస్సులు నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు నిర్వహిస్తాం. ఈనెల చివరి నాటికి ఆదేశాలు వచ్చే అవకాశం ఉంది.

రేషన్‌కార్డుల ప్రక్రియ ఎలా ఉంది?

రేషన్‌కార్డుల ప్రక్రియ కొనసాగుతుంది. చేర్పులు, మార్పులు కొత్తరేషన్ కార్డుల కోసం నేటికీ చాలామంది నుంచి దరఖాస్తులు అందుతున్నాయి. డీఎస్‌వో ద్వారా రేషన్‌కార్డుల నమోదు, కొత్తకార్డుల ప్రక్రియ కూడా జరుగుతుంది.

న్యూస్ బాక్స్

ముగిసిన ఓపెన్ ఇంటర్ ప్రయోగ పరీక్షలు

గద్వాల సర్కిల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓపెన్ ఇంటర్ ప్రయోగ పరీక్షలు గద్వాల జిల్లాలో ముగిసినట్టు ఇన్‌ఛార్జి డీఈవో అబ్దుల్ ఘని, ప్రభుత్వ పరీక్షల జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. గద్వాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో సోమవారం జరిగిన ఫిజికల్ సైన్స్‌ప్రయోగ పరీక్షకు 20 మంది విద్యార్థులకు గాను 19మంది (95 శాతం), కెమిస్ట్రీ ప్రయోగ పరీక్షకు 15మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 13మంది (86శాతం) విద్యార్థులు హాజరైనట్లు వివరించారు. పరీక్షల తీరును అసిస్టెంట్ కమిషనర్ పరిశీలించారు. ప్రయోగ పరీక్షకు సంబంధించిన పూర్తి వివరాలను సీఎస్ వీరన్నను అడిగి తెలుసుకున్నారు.

మెడికల్ అధికారుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గద్వాలన్యూటౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గద్వాల జిల్లా ఎన్‌హెచ్‌ఎం (నేషనల్ హెల్త్ మిషన్) ప్రోగ్రాం కింద కాంట్రాక్ట్ పద్ధతిలో మెడికల్ ఆఫీసర్లుగా పనిచేసేందుకు దరఖాస్తులను కోరుతున్నట్లు కలెక్టర్ బీఎం సంతోష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రోగ్రాం కింద బస్తీ దవాఖానాల్లో(3) మెడికల్ అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. దరఖాస్తులను మే 3వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు దరఖాస్తులను డీఎంహెచ్‌వో కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

మజ్జిగ పంపిణీ

గద్వాలఅర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): శ్రీ గురుదత్త సేవాసమితి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం పట్టణంలోని గాంధీచౌక్‌లో ప్రతి సోమవారం మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని సేవాసమితి సభ్యులు తెలిపారు. అందులో భాగంగా దాత కంసలి సుదర్శన్ సహకారంతో స్థానిక గాంధీచౌక్‌లో ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు వీరన్న, విజయ్‌కుమార్, శ్రీనాథ్, ఉమేశ్, ఆత్మ, ప్రశాంత్, ఏపూరిప్రసాద్, జగదీశ్, ఎస్ఎన్ ప్రకాశ్, బ్రహ్మన్న, రాజారెడ్డి, కే.నాగరాజు, విశాల, పద్మలత, చిత్తారి కిరణ్ ఉన్నారు.

నేటి నుంచి నూతన ఆలయంలో ప్రత్యేక పూజలు

మానవపాడు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోకులపాడులో రూ.కోటి 20లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఆలయంలో మంగళవారం నుంచి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వేసవి తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

వడ్డేపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): విద్యలో వెనుకబడిన 6, 7, 8వ తరగతుల విద్యార్థులకు వేసవిలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. జిల్లా విద్యాశాఖ, ఎంపీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం వడ్డేపల్లి మండలం కోయిలదిన్నెలో గ్రామం యూపీఎస్‌లో 'వేసవి చదువుల పంట' కార్యక్రమం ప్రారంభించారు. గ్రామ మాజీసర్పంచు పుల్లారెడ్డి, సీఆర్‌పీఎఫ్ సభ్యులు వెంకట్రామ్‌రెడ్డి, ఎంపీ ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ హనిమిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ మదర్స్ కమిటీ సభ్యులు, జయంతి ఉన్నారు.

భూభారతి చట్టంతో శాశ్వత పరిష్కారం

▸▸ వడ్డేపల్లి అవగాహన సదస్సు

▸▸ పాల్గొన్న కలెక్టర్ బీఎం సంతోష్



వడ్డేపల్లిలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

వడ్డేపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంతో ప్రతీరైతుకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. ఈ చట్టం ద్వారా వివాదాలను తక్షణమే పరిష్కరించడంతో పాటు అన్నిరకాల సమస్యలు తొలగిపోతాయని తెలిపారు. సోమవారం వడ్డేపల్లిలోని ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన భూ భారతి చట్టం-2025 అవగాహన సదస్సుకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.ధరణి చట్టంలో ఎదురైన సమస్యల పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టం ప్రవేశపెట్టిందన్నారు. ప్రతి రైతుకు ఆధార్‌కార్డులాగే భూదార్ కార్డు ఇవ్వనుందని, దీనివల్ల భూములకు సంబంధించిన అన్ని రికార్డులు సులభంగా పొందగలుగుతారని తెలిపారు. భూ భారతి చట్టం ద్వారా అసైన్డ్ భూముల రెగ్యులరైజేషన్, సాదా బైనామాల సమస్యలు, సరిహద్దు వివాదాలు, మ్యూటేషన్, రిజిస్ట్రేషన్ వంటి అంశాలు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని తెలిపారు. రైతుల సర్వే సమస్యలను పరిష్కరించేందుకు లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించనుందని, దీనిద్వారా భూములకు సంబందించిన వివాదాలు సర్వే చేసి మ్యాపులతో పట్టా పాస్ పుస్తకంలో చేర్చుకోవడానికి అవకాశం ఉందన్నారు. రిజిస్ట్రేషన్, గిఫ్టడీడ్, పార్టిషన్, మ్యూటేషన్, ల్యాండ్ ఎక్స్ఛేంజ్, వారసత్వం వంటి చిన్న సమస్యలు తహసీల్దార్ స్థాయిలో పూర్తి అవుతాయని కలెక్టర్ వివరించారు. ఓఆర్‌సీ, ఇనామ్, అసైన్‌మెంట్, సీలింగ్, ల్యాండ్, లోక్‌అదాలత్ తదితర భూ సమస్యలు ఆర్డీవో స్థాయిలో పరిష్కరిస్తారని తెలిపారు.

త్వరగా పరిష్కారానికే కొత్త చట్టం

రాజోలి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని కలెక్టర్ అన్నారు. రాజోలిలోని రైతువేదిక భవనంలో సోమవారం రాజోలి తహసీల్దార్ రాంమోహన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన భూభారతి చట్టం అవగాహన సదస్సుకు అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూభారతి చట్టం వల్ల సాదాబైనామాలు, హద్దు పంచాయతీలు, సర్వే ఇబ్బందులు త్వరగా పరిష్కారమవుతాయన్నారు. ఈ చట్టంలో అప్పీల్ వ్యవస్థకు అధిక ప్రాధాన్యం ఉందని, తహసీల్దార్ ఉత్తర్వులపై ఆర్‌డీవో, కలెక్టర్ వద్దకు వెళ్లి అప్పీలు చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. వారసత్వ భూమి మార్పిడిలో సర్వేయర్ ఇచ్చే కమతం నక్షను పాసుబుక్కులో జత చేయడం వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా ఉంటాయని, అలాంటి అంశాలను ఈ చట్టంలో పొందుపరిచారని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ దొడ్డప్ప, వైస్ చైర్మన్ కుమార్, తహసీల్దార్ రాం మోహన్, ఎంపీడీవో ఖాజా మొయినుద్దీన్, మండల వ్యవసాయ అధికారి సురేఖ, ఆయా శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో పాల్గొన్న రైతులు, గ్రామస్థులు

కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, తహసీల్దార్ వీరభద్రప్ప, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, అలంపూర్ మార్కెట్ యార్డు చైర్మన్ దొడ్డప్ప, వడ్డేపల్లి మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్ కుమార్, మునిసిపల్ కమిషనర్ రాజప్ప, అధికారులు, రైతులు ఉన్నారు.

నష్టపోయిన రైతులందరినీ ఆదుకుంటాం

● ధరూర్ ఐకేపీ కేంద్రంలో వడ్లను, కేటీదొడ్డి మండలంలో పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే బండ్ల



ధరూరు ఐకేపీ కేంద్రంలో వడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి



కేటీదొడ్డి: కొండాపురంలో రాలినమామిడి కాయలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ధరూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షం కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకునేలా సత్వర చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ధరూర్‌లోని ఐకేపీ కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈసందర్భంగా కొనుగోలు కేంద్రం వద్ద ఎమ్మెల్యే రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గన్నీ బ్యాగుల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా మని రైతులు ఎమ్మెల్యేకు వివరించగా, తక్షణమే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి గన్నీ బ్యాగులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూఅకాలవర్షం కారణంగా గద్వాల నియోజకవర్గంలోని పలుగ్రామాల్లో వరి ధాన్యం వర్షానికి తడిపోయిందని, మామిడి తోటల్లో కూడా మామిడి కాయలు రాలిపోడంతో రైతులకు తీవ్ర నష్టం వాట్లిందన్నారు. దాదాపుగా రూ.25 లక్షల వరకు రైతులకు నష్టం రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని సీఎంతో పాటు వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వం తరపున ఆదుకునేలా చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. అలాగే సంబంధిత అధికారులు పూర్తిస్థాయి నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వాని పంపి రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు ఉపక్రమించాలని సూచించారు.ఎమ్మెల్యే వెంట వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ కురువ హనుమంతు, జిల్లా సీనియర్ నాయకుడు గడ్డం కృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రాజశేఖర్, మాజీ వైస్ ఎంపీ పీ రామకృష్ణనాయుడు, నాయకులు ఉరుకుందు, శేఖర్‌రెడ్డి, రాజేశ్, చంద్రశేఖర్, డీవై రామన్న, తిమ్మారెడ్డి, గోపి, పవన్‌రెడ్డి, కార్యకర్తలుఉన్నారు.

● మామిడి తోటల పరిశీలన

కేటీదొడ్డి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉరుములు మెరుపులతో కురిసిన అకాల వర్షం కారణంగా నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కేటీదొడ్డి, కొండాపురం, వెంకటాపురం, ఇర్కిచేడు తదితర గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కురిసిన అకాల వర్షానికి రైతులు తీవ్రంగా నష్టపోయారు. సోమవారం ఎమ్మెల్యే కొండాపురంలో పర్యటించి తడిసిన వరి ధాన్యాన్ని, మామిడి తోటల్లో రాలిన మామిడి కాయలను పరిశీలించారు. ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి వెంటనే అకాల వర్షం కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ద్వారా ఆదుకోవాలని సంబంధిత అధికారులు నష్టపోయిన రైతుల దగ్గర నుంచి పూర్తి నివేదికను తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతులకు నష్టపరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. మామిడి తోట చేతికి వచ్చే సమయానికి వర్షం కారణంగా పంట మొత్తం నాశనం అయిందని, ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవాలన్నారు. అలాగే ఆయాగ్రామాల్లో పిడుగుపాటుకు ఆవులు, బర్రెలు, ఎద్దులు, మేకలు, గొర్రెలు మరణించాయని ప్రభుత్వం ద్వారా ఆ రైతులను కూడా ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ హను మంతు, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, రాజశేఖర్, రామకృష్ణ నాయుడు, ఉరుకుందు, గోపి, శేఖర్‌రెడ్డి, రాజేశ్, చంద్రశేఖర్, రామన్న, తిమ్మారెడ్డి, పవన్‌రెడ్డి, ఆయాగ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీలు అందజేత

గద్వాల న్యూటౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గద్వాలమండల అనంతపురానికి చెందిన శ్యాంసన్‌కు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.2.50లక్షల ఎల్‌వోసీని ఎమ్మెల్యే లబ్ధిదారులకు క్యాంపు కార్యాలయంలో అందజేశారు. అలాగే మల్దకల్ మండలంలోని విఠలాపురానికి చెందిన టి.పార్వతమ్మకు రూ.2.50 లక్షల ఎల్‌వోసీని, ధరూర్ మండలం మార్లబీడుకు చెందిన అంజనప్పకు మెరుగైన వైద్యచికిత్స నిమిత్తం రూ. 2లక్షల ఎల్‌వోసీని ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీచైర్మన్ బండారి భాస్కర్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రామన్‌గౌడ, మాజీ సర్పంచు పురుషోత్తం, మాజీ కౌన్సిలర్ శ్రీనుఉన్నారు.

అవయవదానం చేసిన మహిళకు అంత్యక్రియలు

అలంపూర్‌చౌరస్తా ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అవయవదానం చేసిన మహిళ అంత్యక్రియలను సోమవారం ఉండవెల్లి మండలంలోని బొంకూరులో నిర్వహించారు. గ్రామానికి చెందిన హొదేకారి నర్సుబాయి(50) గురువారం ఇంట్లో జారి కిందపడి స్పృహ తప్పి పడిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యం ఆలస్యం అవుతుందని అదేపట్టణంలోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బ్రెయిన్ డెడ్ అయ్యిందని తెలిపారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందింది. దీంతో ఆమె కోరిక మేరకే అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేసినట్లు గ్రామమాజీ సర్పంచ్ శ్రీలత భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మృతదేహాన్ని పూలు చల్లుతూ ఆసుపత్రి నుంచి ఇంటికి సాగనంపారు. ఈ విషయం తెలియడంతో గ్రామస్థులు అంతిమయాత్రకు ప్రత్యేక పూలరథం ఏర్పాటు చేసి బాణసంచా కాలుస్తూ వైకుంఠధామానికి తరలించారు. భాస్కర్‌రెడ్డి, రాధమ్మ, భరత్‌రెడ్డి, కోటీశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులను అభినందించి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు.



హొదేకారి నర్సుబాయి

కార్మిక చట్టాలను విస్మరించిన కేంద్ర ప్రభుత్వం

● ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కార్తీక్

ధరూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విస్మరించిందని ఐఎఫ్‌టీయూ జిల్లాప్రధాన కార్యదర్శి జమ్మిచేడు కార్తీక్ అన్నారు. అదే సమయంలో మేడే స్ఫూర్తితో కేంద్ర అమలుచేస్తున్న నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోసం కార్మికలోకం ఐక్యతో పోరాడాలని పిలుపునిచ్చారు. సోమవారం ధరూరువైఎస్సార్ సర్కిల్‌లో 139వ మే డే పోస్టర్లను నాయకులు, కార్మికులు విడుదల చేశారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ వెంటనే పర్మనెంట్ చేయాలని, ప్రభుత్వరంగ సంస్థలను అమ్మకుండా కాపాడాలన్నారు. సమాన పనికి సమాన వేతనం వెంటనే అమలుచేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అశోక్, వెంకటేశ్, జమ్మన్న, రాజు, వీరేశ్, బందయ్య, వడ్డే వీరేష్, మల్లయ్య, తాయప్ప, శ్రీను, సుధాకర్, గోవిందు, మద్దిలేటి ఉన్నారు.



ధరూర్‌లో మే డే పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు, కార్మికులు

తప్పిన పెను ప్రమాదం

● విద్యుత్ పోల్‌కు తగిలిన టిప్పర్

● గట్టులో విద్యుత్ సరఫరాకు అంతరాయం

గట్టు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం పెనుప్రమాదం తప్పింది. గట్టు బస్టాండ్‌కు సమీపంలో ఉన్న విద్యుత్ పోల్‌ను మొరంతో వెళ్తున్న బారి టిప్పర్ తగలడంతో విద్యుత్ పోల్ కాస్త వంగి పోయింది. విద్యుత్ పోల్ కిందకు కూలకుండా అలాగే వంగి ఉండటంతో ఎవ్వరికి ప్రమాదం జరగలేదు. ఒకవేళ బలంగా తగిలి ఉంటే విద్యుత్ తీగలు తెగి పెనుప్రమాదం సంభవించి ఉండేదని స్థానికులు భయాందోళన చెందారు. గట్టులో సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతుండటంతో వాహనాల రాక పోకలకు ఇబ్బందులు కలగుతున్నాయి. ఈక్రమంలో టిప్పర్ ఒకటి మోరం వేసుకుని వెళ్తున్న క్రమంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ విషయం తెలిసిన వెంటనే విద్యుత్ అధికారులు అక్కడికి చేరుకుని స్థంభాన్ని సరిచేశారు. దీనివల్ల గట్టు గ్రామంలో సోమవారం విద్యుత్ సరఫరాలో కొంత అంతరాయం ఏర్పడింది. ఎలాంటి నష్టం జరగకపోవడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.



గట్టు బస్టాండ్ వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన టిప్పర్

ప్రజావాణి ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి



ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఆర్డీవో శ్రీనివాసరావు

గద్వాలన్యూటౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తూ వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీఓ శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 25ఫిర్యాదులు అందినట్లు ఆయన తెలిపారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో నరేందర్ ఉన్నారు.

ప్రజావాణిలో కనిపించని అధికారులు!

▸▸ కలెక్టర్ లేకుంటే సంతకం పెట్టి వెళ్లిపోతున్న పలువురు



ప్రజావాణిలో కలెక్టర్ లేకపోవడంతో అధికారులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

గద్వాలన్యూటౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మొదటికే ప్రజావాణిలో సమస్యలను తెలుపుతున్న అధికారులు నిర్లక్ష్యం చేస్తూ పనులను పెండింగ్‌లో పెడుతున్నారనుకుంటే సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఎక్కువ సంఖ్యలో అధికారులు రాకపోవడం, వచ్చినా సంతకాలు చేసి వెళ్లిపోయిన సంఘటన జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో చోటుచేసుకుంది. ఇందుకు కారణం కలెక్టర్, అదనపు కలెక్టర్లుఇతర కార్యక్రమాలకు వెళ్లడమే.. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. జిల్లాలోని వడ్డేపల్లి మండలంలో సోమవారం భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్‌తో పాటు అదనపు కలెక్టర్ కూడా వెళ్లడంతో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని ఆర్డీవో శ్రీనివాసరావు, ఏవో నరేందర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. అయితే ప్రజావాణిలో ఫిర్యాదులు వచ్చిన వెంటనే సంబంధిత అధికారికి కలెక్టర్ ఆ ఫిర్యాదుపై వివరాలను అడుగుతారు. ఈ క్రమంలో ప్రజావాణి కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు రావాల్సి ఉంటుంది. అయితే ఈ సోమవారం కలెక్టర్, అదనపు కలెక్టర్ లేకపోవడంతో ఇక తమను ఎవరు పట్టించుకోరని చాలామంది అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. మరికొందరు హాలులో రిజిస్టర్‌లో సంతకం చేసి అక్కడి నుంచి వెళ్లినట్లు తెలుస్తుంది. ఇంకొందరు కేవలం సెల్‌ఫోన్ చూసేందుకే ప్రజావాణికి వస్తున్నారా అన్నవిధంగా కలెక్టరేట్ హాలు కనపడింది. ఇలా కలెక్టర్ ఉంటేనా అధికారులు ఉంటారా... లేదంటే అధికారులకు ప్రజావాణి పట్టదా అంటూ బాధితులు బాహాటంగానే చెప్పుకోవడం అందిరి చెవిన పడింది. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి అధికారులు ప్రజావాణికి హాజరుకావడంతో పాటు ప్రజాఫిర్యాదులను సత్వరంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారులు కోరుతున్నారు.

ఇళ్ల పంపిణీలో అధికార పార్టీ నేతల జోక్యం వద్దు

గద్వాలన్యూటౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అధికార కాంగ్రెస్ పార్టీ ఏడాది కాలంగా ఊరిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో అవకతవకలు జరుగుతున్నాయని, నేతల జోక్యం లేకుండా ఇళ్ల పంపిణీ నిర్వహంచాలని బీజేపీ పట్టణ అధ్యక్షురాలు రజకజయశ్రీ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ ప్రజాపాలన పేరిట 2024 జనవరిలో ఒకసారి, అదే ఏడాది చివరలో రెండోసారి వార్డుల వారీగా సభలు నిర్వహించి తెల్లరేషన్‌కార్డు ఉన్న వారితో ఇందిరమ్మ ఇల్లు కట్టుకోవడానికి రూ.5లక్షల రుణాలు ఇస్తామని చెప్పి వారితో దరఖాస్తులు తీసుకున్నారని, అందుకు అర్హులైన వారి జాబితాను కూడా చూపడంలేదని తెలిపారు. అధికార పార్టీ నాయకుల అండతో వారికి కావాల్సిన వారికే కేటాయిస్తూ నిజమైన లబ్ధిదారులకు మొండిచేయి చూపడం జరుగుతుందన్నారు. కలెక్టర్ స్పందించి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్ల రుణాలు వచ్చేలాచూడాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో బండల వెంకట్రాములు, దేవదాస్, రజక జయశ్రీ, రజక నర్సింహులు, చిత్తారికిరణ్, వెంకటేశ్, నర్సింహులు, అనిల్ ఉన్నారు.


మద్యం మత్తులో బీరుసీసాతో యువకుడి దాడి

● పోలీస్ స్టేషన్‌లో దుర్భాషలాడిన వైనం

● కేసు కాకుండా పోలీసులపై కొందరి ఒత్తిడి

గద్వాల క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఫుల్లుగా మద్యం తాగిన ఓ యువకుడు గంజిపేటకు చెందిన మరో యువకుడిపై బీరు సీసాతో దాడిచేసిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకొంది. ఇందుకు సంబంధించి పోలీసులు, బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గంజిపేటకు చెందిన ఓ యువకుడు తమ మిత్రుతో కలిసి జిల్లా కేంద్రంలోని ఓ బార్‌అండ్ రెస్టారెంట్‌లో మద్యం తాగాడు. ఇంటికి వెళ్లేందుకు ప్రయత్నించగా అదేరెస్టారెంట్‌లో ఫుల్లుగా మద్యం తాగిన గంజిపేట కాలనీకి చెందిన మరో యువకుడు కలిసి కాలనీలోకి వెళ్తున్నాము కదా... మరో రెండుబీర్లు తెస్తాను కలిసి తాగుదాం అనిఒత్తిడి చేయగా, నాకు వద్దని ఇప్పటికే లేట్ అయ్యిందని చెప్పడం జరిగింది. అయినప్పటికి మద్యం మత్తులో ఉండటంతో ఆ యువకుడు ఇదేమీ వినకుండా తనతో కలిసి తాగాలని చెప్పడంతో గత్యంతరం లేక అంగీకరించారు. వారిద్దరూ కలిసి గంజిపేట కాలనీలోని వాటర్ ట్యాంక్ సమీపంలో కూర్చున్నారు. కొద్దిగా మద్యం తాగిన వెంటనే మరో యువకుడు కోపంతో బీరుసీసాను పగులగొట్టి పొడవడంతో రక్త గాయాలయ్యాయి. కాగా పొడిచిన యువకుడే ముందుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తనపై హత్యాయత్నం జరిగిందని, కేసు నమోదు చేయాలని చెప్పాడు. ఫిర్యాదు రాసివ్వాలని పోలీసులు చెప్పారు. కానీ కేసు అయినట్లు ఎఫ్ఐఆర్ కాఫీ ఇవ్వాలంటూ అతడు డ్యూటీలో ఉన్న ఓ కానిస్టేబుల్‌పై ఒత్తిడి తెచ్చాడని పోలీసులు తెలిపారు. అయితే రాత్రి ఆలస్యం కావడంతో మరుసటి రోజు ఇస్తామని చెప్పినా వినకుండా దుర్భాషలాడినట్లు సదరు పోలీసు సిబ్బంది తెలిపారు. అనంతరం బీరుసీసా దాడిలో గాయపడిన వ్యక్తి రావడంతో పోలీసులు ఆసుపత్రికి వెళ్లి రావాలని సూచించారు. గాయాలైన ఆ యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొంది ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. అయితే ఈ విషయంపై దాడి చేసిన యువకుడికి వత్తాసు పలుకుతూ కొందరు మీడియా ప్రతినిధులు కేసును పక్కదోవ పట్టించేలా పోలీసులపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. కేసు కాకుండా నేతలతో ఫోన్‌లు కూడా చేయించినట్లు విశ్వసనీయంగా తెలుస్తున్నది. అయితే ఈ విషయంపై పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్‌ను వివరణ కోరగా కేసు చాలా సెన్సిటివ్‌గా ఉన్నదని వివరాలను చెప్పేందుకు ఇబ్బందులు పడ్డాడు. సీఐ టంగుటూరి శ్రీనును వివరణ కోరగా కేసు నమోదు చేయడం జరిగిందని, అయితే పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

జిల్లాలో మేడేను విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి

గద్వాల టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మిక దినోత్సవం మే డేను జిల్లా అంతటా మే 1న విజయవంతంగా నిర్వహించుకుందామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ శ్రమ దోపిడీకి అవకాశం కల్పిస్తూ పెట్టుబడిదారీవర్గాల అనుకూల విధానాలను అవలంబిస్తున్న తరుణంలో మే డే ప్రాముఖ్యతను మరింత సమర్థంగా వినిపించాల్సిన బాధ్యత కార్మికలోకంపై ఉందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించే ర్యాలీలో అన్నివర్గాల కార్మికులు పాల్గొనాలని, ప్రతీ కార్మిక అడ్డా వద్ద జెండాను ఎగురవేయాలని సూచించారు. సమావేశంలో సీఐటీయూ దాని అనుబంధ సంఘాల నాయకులు గట్టన్న, శివ, బాలకృష్ణ, రంగన్న, నరసింహులు, రాజు, వెంకటేశ్, రామకృష్ణ, మహేశ్ ఉన్నారు.